

పదో తరగతి పరీక్ష ఫీజుకు 28 వరకు గడువు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు సంబంధించి రెగ్యులర్, ఫెయిలైన విద్యార్థులు ఈ నెల 28 వరకు సంబంధిత ప్రధానోపాధ్యాయులకు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో డిసెంబరు 10 వరకు, రూ.200 రుసుంతో 12 వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబరు 30 వరకు చెల్లించాలని పేర్కొన్నారు. విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించి గడువులోగా చెల్లించాలని కోరారు.

'ఉపాధిహామీ'లో గోల్‌మాల్

- ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లు సస్పెన్షన్
- రూ.3,92,516 రికవరీ చేయాలని ఆదేశాలు



పెద్దశంకరంపేటలో నిర్వహించిన సామాజిక తనిఖీలో అధికారులు

పెద్దశంకరంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టిన ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీలో భారీగా అక్రమాలు వెలుగుచూశాయి. ఆగ్రహించిన ఉన్నతాధికారులు బాధ్యులైన ముగ్గురు ఫీల్డ్‌అసిస్టెంట్లను సస్పెండ్ చేశారు. ఈ విషయాన్ని అడిషనల్ డీఆర్డీవో రంగాచారి వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం సామాజిక తనిఖీ ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.5,48,71,000 వ్యయంతో వివిధ పనులు చేపట్టారు. ఈ మొత్తంతో 267 రకాల పనులు చేయాల్సి ఉంది. ఆయా పనులకు సంబంధించిన రికార్డులను సామాజిక తనిఖీలో భాగంగా తనిఖీ చేశారు. బద్దారం, చీలపల్లి, గొట్టిముక్కుల గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో భారీ అవినీతి జరిగినట్టు ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టారు. పనుల్లో అవినీతి జరిగినట్టు గుర్తించారు. ఆయా గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రవీణ్, శివ్వయ్య, వెంకటేశను సస్పెండ్ చేసినట్టు అధికారులు వెల్లడించారు. ఇతర పనుల్లో 3,90,516 రూపాయలు రికవరీ చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. వివిధ పనులకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు రూ.63.600 జరమానా జరిమానా విధించనట్టు తెలియజేశారు.

కార్యకర్తల పక్షపాతిని నేను..

- మీ అందరీ వల్లే నాకు ఈ పదవీ
- టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కమార్ గౌడ్
- కాంగ్రెస్ కార్యక్తలు ఎదురొడ్డి పోరాడారు
- మంత్రి దామోదర రాజనర్సింహ
- స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



పీసీసీ చీఫ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి



ర్యాలీగా వస్తున్న మంత్రి దామోదర్, పీసీసీ చీఫ్ మహేష్‌కమార్‌గౌడ్‌తో నవ్వులు చిందిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

కొండాపూర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : 'కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పక్షపాతిగా నేను పని చేస్తా.. మీ అందరీ వల్లే నాకు పీసీసీ అధ్యక్ష పదవి వచ్చింది' అని టీపీసీసీ చీఫ్ మహేష్ కమార్‌గౌడ్ అన్నారు. సోమవారం మల్కాపూర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ మహేష్ కమార్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతీ కార్యకర్తను కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తుందన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ తొమ్మిదిన్నర సంవత్సరాల అరాచక దొరల పాలనకు ఎదురొడ్డి పోరాడింది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలేనని గుర్తుచేశారు. ప్రతీ కార్యకర్త కృషితోనే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని స్పష్టం చేశాడు. వార్డు నుంచి ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్ వరకు కాంగ్రెస్ నాయకులనే గెలుపించుకుంటామన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో సత్తా చాటుతామన్నారు. ప్రతీ కార్యకర్త కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు హామీలను క్షేత్రస్థాయిలో తీసుకువెళ్లాలన్నారు. జిల్లా, నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి ఆదేశాల మేరకు పనిచేస్తున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, కాంగ్రెస్ నేత నీలం మధు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



సీతానగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న అన్నదాతలు

కొనుగోలు కేంద్రాలు తెరిచారు సరే..

తూకం వేసేదెప్పుడు?

నిన్న మొన్నటి వరకు గోనె సంచుల కొరత..
ఇప్పుడు హమాలీల సమస్య

మూడు వారాలుగా అన్నదాతల పడిగాపులు

సీతానగర్‌లో పేరుకుపోతున్న ధాన్యం నిల్వలు

వడ్లు తూకం వేయాలని ఆందోళనకు దిగిన రైతులు

అల్లాదుర్గం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం విక్రయించడానికి అన్నదాతలు చెమటోడ్చాల్సి వస్తున్నది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా.. తూకంలో జాప్యం జరుగుతుండడంతో రోజుల తరబడి రైతులు కేంద్రాల వద్దనే పడిగాపులుకాయాల్సి వస్తున్నది. దీంతో, ఓపిక నశించి ఆందోళన బాటపడుతున్నారు. కేంద్రం వద్దకు వచ్చి మూడు వారాలవుతున్నా తూకం వేయడం లేదని అల్లాదుర్గం మండలం సీతానగర్‌లో రైతులు సోమవారం ఆందోళన చేశారు.

నెల క్రితం కేంద్రం ప్రారంభం

సీతానగర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో గత నెల 23న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఇరువై రోజులుగా వరి కోతలు జోరందుకోవడంతో రైతులు కేంద్రం వద్దకు ధాన్యాన్ని తరలించి ఆరబోస్తున్నారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు మాత్రం తూకం ప్రారంభించలేదు. రైసుమిల్లుల అలాట్‌మెంట్ చేయలేదని, గోనె సంచులు అందుబాటులో లేవని చెప్తూ ధాన్యం తూకం వేయడం లేదు. దీంతో, కొనుగోలు కేంద్రంలో పనిచేయడానికి వచ్చిన ఇతర రాష్ట్రాలకు చెందిన హమాలీలు వేరే చోటికి వెళ్లిపోయారు. మూడు రోజుల క్రితం ఈ కేంద్రానికి అధికారులు గోనె సంచులను పంపించగా అప్పటికే హమాలీలు వెళ్లిపోవడంతో తూకం ప్రారంభం కాలేదు. సంచులు వచ్చినా కూలీలు లేరని నిర్వాహకులు ధాన్యం తూకం ప్రారంభించలేదు.

రైతుల ఆందోళన బాట

హమాలీలు ఉన్నప్పుడు సంచులు లేక.. సంచులు వచ్చిన తరువాత కూలీలు లేరని ధాన్యం తూకం వేయకపోవడంతో సోమవారం రైతులు కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. కేంద్రం వద్దనే వడ్లు ఆరబోయడంతో రేయింబవళ్లు పడిగాపులు కాయాల్సివస్తున్నదని వారు ఆవేదనను వ్యక్తం చేశారు. ఐకేపీ, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరితోనే ధాన్యం కొనుగోలు

మిగతా 8వ పేజీలో..

నిషేధం నవ్వుల పాలు..

గుట్టుగా గుట్కా దందా

డంపింగ్ కేంద్రంగా జహీరాబాద్

- కర్ణాటక, మహారాష్ట్ర నుంచి ఇక్కడికి తరలింపు
- గుట్టుచప్పుడుకాకుండా రాష్ట్రమంతా సరఫరా
- జోరుగా విక్రయాలు
- పాన్‌షాప్‌లు, హోటళ్లు, దుకాణాల్లో లభ్యం!



గుట్కాలపై నిషేధం నవ్వుల పాలవ్వుతున్నది. పాన్‌షాపులు.. కిరాణా దుకాణాలు.. చాయ్ హోటళ్లు.. ఎక్కడ చూసినా గుట్కాలు విచ్చలవిడిగా దొరుకుతున్నాయి. పాన్‌మసాలా పేరిట యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. ఈ దందాకు జహీరాబాద్ నియోజకవర్గమే కేంద్రంగా మారింది. గుట్టుచప్పుడు కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి ఇక్కడికి తరలించి డంప్‌చేసి, రాత్రివేళల్లో హైదరాబాద్‌తో పాటు జిల్లాలకు తరలిస్తున్నారు. పోలీసులు అప్పుడప్పుడూ పట్టుకుంటున్నా.. దొరికింది కొంతేనని తెలుస్తున్నది.

జహీరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ నియోజకవర్గంలో గుట్కా అమ్మకాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. స్థానికంగా కిరాణా దుకాణాలు, పాన్‌షాపులు, చాయ్ హోటళ్లలో గుట్కా విక్రయిస్తున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వివిధ రకాల వాహనాల్లో జహీరాబాద్ ప్రాంతానికి తీసుకువచ్చి డంప్ చేస్తున్నారు. అనంతరం రాత్రివేళ్లల్లో గుట్టుచపుడుకాకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం నిత్యకృత్యమైంది. పోలీసులు నిఘావేసి అప్పుడప్పుడు గుట్కాలను పట్టుకుంటున్నా ఈ దందాకు అడ్డుకట్ట పడడంలేదు. పాన్ మసాలాల పేరిట దర్జాగా విక్రయాలు కొనసాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసులు తనిఖీలు చేసినప్పుడు కొంత పట్టుబడుతున్నా దొరుకుతున్నది కొంతేనని.. పెద్దమొత్తంలో తరలిపోతున్నదని తెలుస్తున్నది.

పాన్‌మసాల మాటున

జహీరాబాద్ ప్రాంతంలో పాన్‌మసాలా పేరిట గుట్కా అమ్మకాలు యథేచ్ఛగ కొనసాగుతున్నాయి. రోడ్లపై ఎక్కడ చూసినా ఖాళీ గుట్కా ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. ఒక్కో కంపెనీ గుట్కా ప్యాకెట్ల మాదిరిలా ఉండే పాన్ మసాలా ప్యాకెట్‌ను తయారు చేయించి అమ్మకాలు చేపడుతున్నారు. వీటిని తినడం మూలంగా అనార్యోగాలకు గురవుతామని తెలిసిన్పటికి వినియోగం విషయంలో వెనుకాడడం లేదు. గుట్కా అమ్మకాలను నిషేధించినా గుట్కాకు కట్టడి పడకపోగా మరింత ఎక్కువ దరలకు విక్రయిస్తున్నారు. నిషేధిత గుట్కా, కల్తీ వస్తువుల విక్రయాలను కట్టడిచేసే యంత్రాంగం కనిపించడం లేదు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన అధికారులు లేకపోవడంతో ఓవైపు దందా మూడుపువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతుండగా.. కొనుగోలుదారులు మాత్రం నష్టపోతున్నారు.



పోలీసులు పట్టుకున్న గుట్కా ప్యాకెట్లు (ఫైల్)

వైద్యవృత్తికి చిహ్నం తెల్లకోటు



సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు వైట్‌కోట్ అందజేసే కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.సుధామాధురి మెడికోలకు తెల్లకోటు అందజేశారు.

-సంగారెడ్డి అర్బన్, (ఆంధ్రజ్యోతి)



విభిన్నం ఖేడ్

- బహుభాషల వాడుకకు నిలయం
- సకల సంస్కృతీసంప్రదాయాల మిళితం
- మూడు రాష్ట్రాల పండగలూ నిర్వహణ

5



సంప్రదాయ దుస్తుల్లో గిరిజన మహిళలు



మెదక్‌లో రోడ్డును కమ్ముకున్న పొగమంచు

చలి.. 12.1 డిగ్రీలు

మెదక్ అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత పెరుగుతోంది. మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో 12.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి చల్లనిగాలులు వీస్తుండడంతో జనం వణికిపోతున్నారు. సాయంత్రం నుంచి వెచ్చని దుస్తులు ధరించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏ మండలంలో చూసినా 12 నుంచి 18.6 డిగ్రీలలోపే ఉష్ణోగ్రత నమోదవుతోంది.

కనిష్ఠ ఉష్ణోగ్రతలు

- సంగారెడ్డి జిల్లాలోని అన్నాసాగర్, అల్మాయిపేట 12.1, నల్లవల్లి, కంగ్టి 12.2, సిర్గాపూర్ 12.3, కోహీర్ 12.4, పటాన్‌చెరులో 12.4, కంది 12.6, పుల్కల్ 12.7, సత్వార్ 12.8, బీహెచ్‌ఈఎల్ 12.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.
- సిద్దిపేట జిల్లాలోని కొండపాక 12.1, పోతారెడ్డిపేట 12.2, అంగడికిష్టాపూర్ 12.3, చిక్కోడ్ 12.5, మిరుదొడ్డి 12.6, వెంకట్‌రావుపేట 12.8 డిగ్రీలు నమోదయ్యాయి.
- మెదక్ జిల్లాలోని చిట్కుల్, డీధర్మారం 12.1, భుజరంపేట 12.2, శివ్వంపేట 12.5, నార్లాపూర్ 12.8, నాగాపూర్, పెద్దశంకరంపేట 12.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

గ్రూప్-3 ప్రశాంతం

ముగిసిన పరీక్షలు

సంగారెడ్డి జిల్లాలో 7,968 మంది..
మెదక్ జిల్లాలో 3,166 మంది హాజరు

అభ్యర్థులతో కిటకిటలాడిన బస్టాండ్లు

మెదక్‌అర్బన్/నర్సాపూర్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు మెదక్ జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 19 కేంద్రాల్లో జరిగిన పరీక్షలో 53.96 శాతం హాజరు నమోదైందని అధికారులు తెలిపారు. మొత్తం 5,867 మంది అభ్యర్థులకు గానూ 3,166 మంది హాజరయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు రావడంతో బస్టాండ్లు కిటకిటలాడాయి. కొంతమంది వాహనాల్లో రావడంతో రోడ్లు రద్దీగా మారాయి. నర్సాపూర్ బీవీఆర్‌ఐటీ కాలేజీలో గ్రూపు-3 పరీక్ష కేంద్రాన్ని అదనపు ఎస్పీ రమేష్ తనిఖీ చేశారు. అభ్యర్థుల హాల్‌టికెట్లను తనిఖీ చేసి లోనికి అనుమతించారు.

రెండో రోజు 7,968 మంది హాజరు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిలా వ్యాప్తంగా గ్రూప్-3 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రెండోరోజు పేపర్-3 పరీక్షకు 15,123 మందికి గాను 7,968 మంది హాజరయ్యారని అధికారులు తెలిపారు.



నర్సాపూర్ బీవీఆర్‌ఐటీలో హాల్‌టికెట్లు తనిఖీ చేస్తున్న అదనపు ఎస్పీ



కుటుంబ వివరాలు నమోదు చేయించుకుంటున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

70.04 శాతం సర్వే పూర్తి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా వ్యాప్తంగా 70.04 శాతం ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే పూర్తయిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన ఎన్యూమరేటర్లు తమ కుటుంబ వివరాలను అందజేసి నమోదు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 70.04 శాతం సర్వే పూర్తయిందని, 1,54,083 కుటుంబాల వివరాలు నమోదు చేశామని తెలిపారు. మిగిలిన ఇళ్లలో గడువు లోపు సర్వే చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

- కౌడిపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొనసాగుతున్న కుటుంబ సర్వేను కలెక్టర్ రాహుల్‌రాజ్ సోమవారం తనిఖీ చేశారు. వివరాలను పక్కాగా నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మండలంలోని మహ్మద్‌నగర్‌లో ధాన్యం కోనుగోలు కేంద్రన్ని తనిఖీ చేశారు.

2,47,426 ఇళ్ల సర్వే పూర్తి

సంగారెడ్డి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియ ముమ్మరంగా సాగుతున్నది. సోమవారం నాడు 28,429 ఇళ్ల సర్వేను చేయగా ఇప్పటివరకు మొత్తం 2,47,426 ఇళ్ల సర్వే పూర్తి చేశారు. జిల్లాలోని 618 గ్రామ పంచాయతీలు, 8 మున్సిపాలిటీల్లో 199 వార్డులు ఉండగా మొత్తం 4,10,049 గృహాలు ఉన్నాయి. ఇందులో జిల్లా వ్యాప్తంగా 3,429 మంది ఎన్యుమరేటర్లు సర్వే చేస్తున్నారు. ఈ నెల 6వ తేది నుంచి ఎన్యూమరేటర్లు ఇంటింటికి తిరుగుతూ స్టిక్కర్లు అతికించిన విషయం తెలిసిందే. ఈ నెల 9 నుంచి ప్రారంభమైన ఇంటింటి సర్వే 28వ తేది వరకు కొనసాగనున్నది. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పర్యవేక్షణలో సర్వే సాఫీగా సాగుతున్నది. ఇప్పటివరకు 60 శాతం సర్వే పూర్తయినట్టు అధికారవర్గాలు తెలిపారు.

'కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయండి'

సంగారెడ్డి రూరల్/జిన్నారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డిలో కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. జిల్లాలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో పనిచేస్తున్న కార్మికులకు యాజమాన్యాలు కనీస వేతనం ఇవ్వకుండా శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని విమర్శించారు. వెంటనే కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, విఠల్, రాజు, కిరణ్, మహేష్ తదితరులు ఉన్నారు. అలాగే బొల్లారం మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం, ఇతర సౌకర్యాలు కల్పించాలంటూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి మున్సిపల్ మేనేజర్ నిర్మలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యమందించాలి

కొల్చారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యమందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ తెలిపారు. సోమవారం కొల్చారం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో ఉన్న సమస్యలతో పాటు ప్రతి రూమ్‌ను పరిశీలించి మాట్లాడారు. రోగులకు అన్నివిధాలుగా మందులు సరఫరా చేసేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు పేర్కొన్నారు. ఆస్పత్రి సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ నవీన్, డాక్టర్ రమేష్, మెడికల్ ఆఫీసర్ హర్షిత తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సేవల గురించి అడిగి తెలుసుకుంటున్న శ్రీరామ్

మొరం అక్రమ తరలింపు

● అడ్డగించిన డాకూరు గ్రామస్థులు

జోగిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అందోలు మండలంలో మట్టి, మొరం దందాలు జోరుగా సాగుతున్నాయి. తాజాగా అందోలు శివారులోని నేషనల్ హైవే పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలోంచి పదుల సంఖ్యలో టిప్పర్లతో సోమవారం ఉదయం మొరం తరలిస్తున్నారు. డాకూరు జంక్షన్ వద్ద స్థానికులు సదరు టిప్పర్లను అడ్డగించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సాగర్ మధుకర్‌రెడ్డి ఘటనా స్థలానికి వచ్చి తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల నుంచి తీసుకున్న అనుమతి మేరకే మొరాన్ని తరలిస్తున్నారని డీటీ సాగర్ మధుకర్‌రెడ్డి పేర్కొన్నారు.



మొరాన్ని తరలిస్తున్న టిప్పర్లు

విద్యుదాఘాతంతో పూరిగుడిసె దగ్ధం

వెల్దుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో పూరిగుడిసె దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని చర్లపల్లితండాలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. తండాకు చెందిన కేతావత్ గోపాల్ కుటుంబసభ్యులతో కలిసి వ్యవసాయ పొలం వద్దకు పని నిమిత్తం వెళ్లారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో ప్రమాదవశాత్తు పూరిగుడిసెలో విద్యుత్‌షాక్ ఏర్పడి మంటలు చెలరేగాయి. దీంతో గుడిసె పూర్తిగా దగ్ధమైంది. గుడిసెలోని పెట్టెలో ఉన్న రూ.20 వేల నగదు, బట్టలు, వంట సామగ్రి, బియ్యం, నిత్యావసర సరుకులు పూర్తిగా కాలిపోయాయి. అలాగే సేవాలాల్ మహరాజ్ ఆలయానికి సంబంధించి రూ.30 వేలతో తెచ్చిన సామగ్రి గోపాల్ గుడిసెలో ఉండగా.. అది కూడా పూర్తిగా కాలిపోయింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనకు 11 కమిటీలు

● సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనకు 11 కమిటీలు ఏర్పాటు చేసినట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో ఈ నెల 21 నుంచి 23వ తేదీవరకు జరిగే జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌లో సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 21న ఉదయం 7.30 గంటల నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభమౌతుందని, విద్యార్థులందరూ తమకు కేటాయించిన కౌంటర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. అనంతరం కమిటీలకు పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, మాజీ సైన్స్ అధికారి విజయ్‌కుమార్, నోడల్ అధికారి లింబాజీ, సంగారెడ్డి ఎంఈవో విద్యాసాగర్, కోహీర్ ఎంఈవో జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి బాలికల క్రీడలు ప్రారంభం

పటాన్‌చెరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ముత్తంగి మహాత్మా జ్యోతిబాఫూలే బాలికల గురుకుల కళాశాలలో అండర్-14, 19 జిల్లాస్థాయి బాలికల క్రీడలను సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి సోమవారం ప్రారంభించారు. మూడురోజుల పాటు జరిగే ఈ పోటీల్లో విద్యార్థినులంతా ఉత్సాహంగా పాల్గొనాలని తెలిపారు. 10 కళాశాలలకు చెందిన 650 మంది విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు.

క్రైం కార్నర్

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరి మృతి



బైండ్ల జశ్వంత్ మృతదేహం

పాపన్నపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడడంతో ఒకరి మృతి చెందాడు. ఏఎస్సై సంగన్న కథనం ప్రకారం మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బైండ్ల జశ్వంత్ (19) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన స్నేహితుడు ఉమామహేశ్వర్‌తో కలిసి ద్విచక్రవాహనంపై పాపన్నపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా యూసుఫ్ పేట గ్రామ శివారులో వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. తీవ్ర గాయాల పాలైన వారిని స్థానికులు 108లో చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే జశ్వంత్ మృతిచెందగా, ఉమామహేశ్వర్‌ను మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య

జోగిపేట, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ పాండు కథనం ప్రకారం టేక్మాల్ మండలం ధనూర గ్రామానికి చెందిన నర్సింహులు(58) కొన్ని రోజులుగా జోగిపేటలోని వాసవీనగర్‌లో నివాసముంటూ కిరాణా దుకాణాన్ని నడుపుతున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దీంతో ఆదివారం దుకాణానికి వెళ్లిన అతను రాత్రయినా ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం అన్నాసాగర్ చెరువులో నర్సింహులు మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విభిన్నం ఖేడ్



మహారాష్ట్రకు చెందిన వారీకార్ సంప్రదాయంలో భజనలు చేస్తున్న భక్తులు



కాయితా గిరిజనులు



భోగ్‌భండార్ నిర్వహిస్తున్న గిరిజనులు

సంగారెడ్డి జిల్లాలోనే మారుమూల ప్రాంతంలో ఉన్న నారాయణఖేడ్ నియోజకవర్గం విభిన్న సంస్కృతులకు నిలయంగా విరాజిల్లుతున్నది. ఓ పక్కన కర్ణాటక, మరో పక్కన మహారాష్ట్ర ఉండడానికి తోడు, ఈ నియోజకవర్గంలో గ్రామాలతో సమానంగా గిరిజన తండాలు ఉండడంతో ఖేడ్ ప్రజలు విభిన్న సంస్కృతీసంప్రదాయాలను ఆచరిస్తున్నారు.

- బహుభాషల వాడుకకు నిలయం
- సకల సంస్కృతీ సంప్రదాయాల మిళితం
- మూడు రాష్ట్రాల పండుగలూ నిర్వహణ



మహారాష్ట్ర, కర్ణాటక విధానంతో టోపీ, తలపాగా ధరించిన వృద్ధులు

నారాయణఖేడ్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యానికి పూర్వం నిజాంపాలనలో నారాయణఖేడ్ ప్రాంతం కొంత కర్ణాటకలోని బీదర్ జిల్లాలో, మరికొంత మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో ఉండేది. భాషాప్రాతిపదికన రాష్ట్రాల విభజన అనంతరం బీదర్, నాందేడ్ ప్రాంతాల్లోని కొన్ని గ్రామాలు నారాయణఖేడ్ నియోజకవర్గంలో చేరాయి. అయినా ఆ గ్రామాల ప్రజలు ఆయా రాష్ట్రాల సంప్రదాయాలను పాటిస్తుండడంతో ఖేడ్ విభిన్న సంస్కృతులకు నిలయంగా వర్ధిల్లుతున్నది.

వివిధ ఆచార సంప్రదాయాలు..

మహారాష్ట్రలోని ఏకాంబ పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి మహారాజ్ ఆధ్వర్యంలో వారికార్ భక్తులు నిరంతరం భజనలు, కీర్తనలు, సప్తాహ కార్యక్రమాలు నిర్వహిస్తారు. సరిహద్దు గ్రామాల్లో ఇప్పటికీ మహారాష్ట్ర, కర్ణాటక సంప్రదాయాన్ని అనుసరిస్తూ టోపీలు, పాగాలు ధరిస్తారు. కర్ణాటక రాష్ట్రంలో మాదిరిగా శూన్యం అమావాస్య, మహారాష్ట్రలో మాదిరిగా పొలాల అమావాస్య వేడుకలను ఇక్కడి రైతులు జరుపుకుంటారు. అంతేకాకుండా పలు పండుగలను మూడు రాష్ట్రాల సంప్రదాయాల్లో నిర్వహించుకుంటారు. ప్రతీ సంవత్సరం పండరిపూర్ క్షేత్రానికి ఆషాడ వారి ఏకాదశిని పురస్కరించుకొని వేలమందితో కాలినడకన దిండియాత్రను



కంగ్టి సమీపంలో కర్ణాటక సరిహద్దు

బహుభాషలు..

కంగ్టి ప్రాంతంవారు మరాఠ, నాగల్‌గిద్ద, మనూరు మండలాల ప్రజలు కన్నడ భాషలో అధికంగా మాట్లాడుతారు. ఈప్రాంతంలో తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠ భాషాలతోపాటు గిరిజనులు గోర్‌బోలి భాషలో మాట్లాడుతుండడంతో ఈ ప్రాంతం బహుబాషాలకు నిలయమని కూడా చెప్పవచ్చు.

కొనసాగిస్తారు. దశాబ్దం క్రితం వరకు కంగ్టి మండలంలోని సరిహద్దు గ్రామాల పాఠశాలల్లో మరాఠ, నాగల్‌గిద్ద మండలంలోని సరిహద్దు గ్రామాల పాఠశాలల్లో కన్నడ బోధన ఉండేది.

కాయితా గిరిజనులు..

నారాయణఖేడ్‌లో గిరిజన తండాలు అధికంగా ఉన్నాయి. సర్దార్‌తండా, బోర్గి తండా, రాజరాంతండాల్లో కాయిత గిరిజనులు నివసిస్తారు. గిరిజనుల్లోనే విభిన్న విధానం వీరిది. శాఖహారం మాత్రమే తీసుకుంటారు. ప్రతి సంవత్సరం వారి ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ దీక్షలు, దసరా సమయంలో భవానీ మాత దీక్షలు స్వీకరిస్తారు. ఆ సమయాల్లో గిరిజనులు ప్రత్యేకంగా తండాల్లో ఉన్న దేవాలయాల వద్ద ఉంటూ ప్రతీరోజు భోగ్ భండార్, భజనలు, కీర్తనలు నిర్వహిస్తారు. ఈ నియోజకవర్గంలో లింగాయత్ సామాజిక వర్గం వారు కూడా అధికంగా ఉంటారు. దీంతో ఖేడ్ ప్రాంతం విభిన్న సంస్కృతులవారు నివాసంగా పేరుగాంచింది.

నిబంధనలు పాటించని హార్వెస్టర్.. కేసు నమోదు

తూప్రాన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై ఉపయోగిస్తున్న హార్వెస్టర్‌పై ఎంవీ యాక్టుపై కేసు నమోదు చేసినట్లు తూప్రాన్ ఎస్ఐ శివానందం వివరించారు. తూప్రాన్ పట్టణంలో సోమవారం హార్వెస్టర్ వాహన వరి కటింగ్ బ్లేడ్‌ను వాహనానికి వెనుక ట్రాలీకి తగిలించి తీసుకెళ్లకుండా ముందు ఇంజన్‌కు బిగించి నిర్లక్ష్యంగా రోడ్డుపై తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో హార్వెస్టర్‌ను పట్టుకొని మోటారు వెహికిల్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి

● మంత్రి దామోదర్ రాజనర్సింహ



లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

అల్లాదుర్గం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. అల్లాదుర్గంలోని శ్రీలక్ష్మీనర్సింహాస్వామి వార్షికోత్సవంలో భాగంగా సోమవారం తెల్లవారుజామున ప్రముఖ పురోహితులు శిలాంకోట ప్రవీణ్‌శర్మ నేతృత్వంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణదాతలు బసనగారి బలరాం, బాలకిషన్ కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, తహసీల్దార్ మల్లయ్య, అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపో మాపో..!

నేల కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభం



సంగారెడ్డి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం నాగాపూర్ (అంతాయపల్లి) గ్రామానికి వెళ్లే రహదారిలో హైటెన్షన్ విద్యుత్ స్తంభం నేలకొరిగేలా కిందకు వంగి ప్రమాదకరంగా మారింది. దీని సమీపంలోనే రైతులు తమ పంట పొలాల్లో వరిధాన్యం కోత కోసి ఆరబెట్టుకుంటున్నారు. అదే విధంగా నాగాపూర్ గ్రామానికి ఈ రోడ్డు గుండానే వెళ్లాల్సి ఉంటుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పలు మార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్తంభాన్ని సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

కోమటి చెరువును సందర్శించిన జర్మనీలు



సిద్దిపేట టౌన్, నవంబరు, 18 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట కోమటి చెరువు వద్ద ఉన్న తెలంగాణ టూరిజం శాఖ నిర్మించిన డైనోపార్క్‌ను జర్మనీకి చెందిన పర్యాటకులు సోమవారం సందర్శించారు. హైదరాబాద్, సిద్దిపేట మరికొన్ని ప్రాంతాల్లో వారు ఈ దేశ సంస్కృతి, సంప్రదాయాలను వారు పరిశీలించారు. కోమటి చెరువు అభివృద్ధిని కొనియాడారు.

20 నుంచి కొండపోచమ్మ వార్షికోత్సవాలు

- ముస్తాబైన దేవాలయం
- 22న శివపార్వతుల కల్యాణం



కొండపోచమ్మ దేవాలయం, కొలువుదీరిన అమ్మవారు

జగదేవ్‌పూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జగదేవ్‌పూర్ మండలం తిగుల్ నర్సాపూర్ సమీపంలోని కొండపోచమ్మ అమ్మవారి 23వ వార్షికోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఈ నెల 20న ప్రారంభమయ్యే ఈ వేడుకలు 22న శివపార్వతుల కల్యాణంతో ముగియనున్నాయి. భక్తుల కోరికలు తీర్చే తల్లిగా విరాజిల్లుతున్న ఈ ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. కొండపోచమ్మతల్లి కొమురవెల్లి మల్లికార్జునస్వామికి స్వయానా చెల్లెలుగా చెబుతుంటారు. కొండపోచమ్మకు యేటా కార్తీకమాసములో వార్షికోత్సవ వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ వేడుకలకు హైదరాబాద్, సికింద్రాబాద్, ఉమ్మడి మెదక్, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ఆలయ వార్షికోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఈవో రవికుమార్ తెలిపారు. ఆలయానికి రంగులు వేయడంతో పాటు విద్యుత్ దీపాలతో అలంకరించామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించామని స్పష్టం చేశారు.

రోజువారీ పూజా కార్యక్రమాలు..

ఆలయంలో మూడు రోజులపాటు విశేష పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. బుధవారం గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండదీపస్థాపన, అగ్నిప్రతిష్ఠాపన, మూత్రమంత్ర హవనము, అభిషేకము నిర్వహిస్తారు. గురువారం ప్రాతకాల పూజ, మూలమంత్ర హోమం స్థాపితా దేవతాపూజ, సామూహిక కుంకుమార్చన, మంగళహారతి వంటి కార్యక్రమాలు ఉంటాయి. శుక్రవారం శివపార్వతుల కల్యాణం ఉంటుంది.

తారును తవ్వేశారు

- ప్రైవేటు పరిశ్రమ నిర్వాకం
- పోలీస్‌స్టేషన్‌లో అధికారుల ఫిర్యాదు



రోడ్డును తవ్వి పవర్ కేబుల్‌ను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కోహీర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో గల ఓ ప్రైవేటు రసాయన పరిశ్రమకు అండర్ గ్రౌండ్ పవర్ సప్లై కోసం ఏకంగా ప్రభుత్వ నిర్మించిన తారు రోడ్డునే తవ్వేశారు. ఈ విషయమై సంబంధిత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. దీంతో సోమవారం కోహీర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం డీఈ రామచంద్రర్ తెలిపారు. 65వ జాతీయ రహదారి నుంచి ఝరాసంఘం మండలంలోని చిల్కేపల్లి గ్రామానికి వెళ్లే ప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖ తారు రోడ్డును స్థానికంగా ఉన్న ఓ రసాయన పరిశ్రమ వారు దర్జాగా వాడేసుకుంటున్నారు. ఈ రోడ్డును మెరుగుపరుస్తామని చెప్పి చిన్నపాటి రోడ్డు పక్కనే ఫుట్‌పాత్ నిర్మించడమే కాకుండా మరోపక్క ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. అలాగే ఈ పరిశ్రమకు వచ్చే లారీలు ఆ రోడ్డు పైనే తరుచుగా నిలిపి ఉంచడం వల్ల ఇతరుల వాహన రాకపోకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయితే పరిశ్రమకు అండర్ గ్రౌండ్ ద్వారా పవర్ సప్లై చేయాలన్న ఉద్దేశంతో పరిశ్రమ వారు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఎక్కడ ఏర్పాటు చేస్తారు... ఏ రకంగా ఏర్పాటు చేస్తారు అనే విషయాన్ని తెలుసుకోకుండానే అనుమతులివ్వడం పలు అనుమానాలకు తావిస్తున్నాయి. తవ్విన రోడ్డును పరిశ్రమవారు పునర్నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



విజేత జట్టుకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

చేగుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి అన్నారు. చేగుంట మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ 14 బాలబాలికల వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బాలికల విభాగంలో ఫైనల్‌లో మెదక్, నిజామాబాద్ జట్లు తలపడగా నిజామాబాద్ విజయం సాధించింది. అలాగే బాలుర విభాగంలో ఫైనల్‌లో రంగారెడ్డిని ఓడించి ఖమ్మం విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ చేగుంటలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు జరుగడం చాలా సంతోషంగా ఉందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని.. ఓటమి పాఠాలు నేర్చుకుని ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో తహసీలార్‌నారాయణ, జిల్లా సెక్రటరీ గంగాల రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లి నరేష్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అయిత పరంజ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, అథ్లెటిక్ జిల్లా సెక్రటరీ మధుసూదన్, రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కర్ణం గణేష్ రవికుమార్, ఎంఈవో నీరజ, ఆదర్శ పాటశాల ప్రిన్సిపల్ చంద్రకళ, ఆర్ఐ నర్సింగ్ యాదవ్, వివధ జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం



మనోహరాబాద్, నవంబరు18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ అగ్రహారం గ్రామంలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి రైతులు తమ పశువులు తీసుకచ్చి వైద్యులకు చూపించారు. పాడి పశువుల్లో గర్భకోశ వ్యాధులను గుర్తించి చికిత్స చేశారు. గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మి, పశువైద్యాధికారి సత్యనారయణ, గోపాలమిత్ర, పర్యవేక్షుడు కృష్ణ కుమార్, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

సరిపోదా పోతారం

- నలుగురు చనిపోయినా మారరా?
- రోడ్డుపై ధాన్యంతో గాలిలో ప్రాణాలు
- ఇప్పటికీ కళ్లముందే పోతారం ఘటన
- అయినా మారని అన్నదాతల తీరు
- నియంత్రించడంతో అధికారులు విఫలం



రామాయంపేట పాత హైవేపై ఆరబోసిన ధాన్యం

రామాయంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రద్దీ రహదారులపై ధాన్యం ఆరబోతతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అన్నదాతల్లో మార్పు రావడం లేదు. ఇటీవల పోతారంలో రోడ్డుపై ధాన్యం వల్ల ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందినా చలనం లేకపోవడమేమిటని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల క్రితం హైవేపైనే కూలీలు సీతాఫలాలు అమ్ముతుండగా.. ఓ వ్యక్తి కారు నిలిపి కొనుగోలు చేసే క్రమంలో.. వెనుక నుంచి వచ్చిన బైక్ కారును ఢీ కొట్టటమే గాక మరో రెండు బైకులకు తగిలి ముగ్గురు తీవ్ర గాయాల పాలయ్యారు. అంతేకాదు గతేడాది ధర్మారం శివారులో రోడ్డుపై ఉన్న వరి కుప్పలను ఓ ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టడంతో అక్కడికక్కడే ప్రాణలు వదిలాడు. రెండేళ్ల క్రితం పులిమామిడి సమీపంలో మరొకరు ప్రమాదానికి గురై చనిపోయాడు. మరెందరో తీవ్ర గాయాలకు గురై ఆస్పత్రిపాలయ్యాడు. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా జరుగుతున్నా రైతులు రహదారులపై ధాన్యం ఆరబోయడం మాత్రం ఆపడంలేదు. రామాయంపేట-సిద్దిపేట మెయిన్ రోడ్డుపై ధాన్యం ఆరబోతతో ఒకే రూట్‌లో పెద్ద పెద్ద వాహనాలు ప్రయాణించడం.. ఇంకో పక్క రోడ్డును అనుకొని మల్లెచెరువు ఉండటంతో అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణం సాగించాల్సి వస్తోందని పలువురు వాహనదారులు, ప్రయాణజకులు వాపోతున్నారు. దీన్ని నియంత్రించడంలో అధికారణం విఫలమవుతున్నది.

కలెక్టర్ ఆదేశించినా..

తరచూ ప్రమాదాల నేపథ్యంలో రెండున్నర నెలల క్రితం స్వయంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ స్థానిక బైపాస్ జంక్షన్‌లో నివారణ చర్యలపై పోలీసులతో చర్చించారు. రోడ్లపై ధాన్యం ఆరబోతను అడ్డుకోవాలని ఆదేశించినా ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. పోతారంలాంటి ఘటనలు మరిన్ని చోటు చేసుకోక ముందే అధికారులు స్పందించి రోడ్లపై ధాన్యం ఆరబోయకుండా తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.



రహదారులే.. కల్లాలుగా..

నర్సాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రోడ్లపై రైతులు అవగాహన లోపంతో ధాన్యం ఆరబెడుతుండటంతో వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. నర్సాపూర్ నియోజకవర్గంలో పలు గ్రామాలకు వెల్లే రోడ్లపై పెద్ద ఎత్తున ధాన్యం ఆరబోత చేపడుతున్నారు. రైతులకు కల్లాలు అందుబాటులో లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో రోడ్లనే కల్లాలుగా వినియోగించడం ప్రయాణికులకు శాపంగా మారుతున్నది. రాత్రిపూట రోడ్లపై ధాన్యం కనిపించక బైకులు అదుపుతప్పి పలువురు గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు రైతులకు అవగాహన కల్పించడంతోప్రతీ గ్రామంలో కల్లాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.



సంగారెడ్డి జిల్లా బాలల న్యాయమండలి సభ్యుడిగా వాసు



ప్రధాన న్యాయమూర్తికి మొక్కను అందిస్తున్న వాసు

సంగారెడ్డి క్రైం, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): సంగారెడ్డి జిల్లా బాలల న్యాయమండలి సభ్యుడిగా జి.వాసు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానీచంద్రను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. బాలలకు సంబంధించిన కేసులను సత్వర పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. పునరావాసంలో ఉన్న బాలలను సన్మార్గంలో ఆలోచించేలా మంచి భవిష్యత్ అందిస్తామన్నారు.

హైకోర్టు ట్రాన్స్‌కో స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా శ్రీధర్‌రెడ్డి



జహీరాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ట్రాన్స్‌కో స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా చిరాగ్‌పల్లికి చెందిన శ్రీధర్‌రెడ్డిని తెలంగాణ ప్రభుత్వం సోమవారం నియమించింది. సెట్విన్‌కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డికి శ్రీధర్‌రెడ్డి స్వయాన సోదరుడు. చిరాగ్‌పల్లికి చెందిన శ్రీధర్‌రెడ్డి హైకోర్టు ట్రాన్స్‌కో స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా నియామకం కావడంతో పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మార్కెట్ కమిటీ నియామకంపై మల్లగుల్లాలు

- పాలకవర్గం పేర్ల ఖరారులో జాప్యం
- అధికార పార్టీ ముఖ్య నాయకుల్లో సఖ్యతలేమి!
- ఎవరికి వారు తమ అనుచరగణానికి ఇప్పించుకునే యత్నాలు
- నర్సాపూర్ కాంగ్రెస్ శ్రేణుల్లో నైరాశ్యం

నర్సాపూర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమించడంలో ఇక్కడి అధికార కాంగ్రెస్‌పార్టీ ముఖ్య నాయకులు మల్లాగుల్లాలు పడుతూ ఇదిగో అదిగో అంటుండటంతో ఆశావహుల్లో తీవ్ర నైరాశ్యం నెలకొన్నది. ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు నియోజకవర్గాల్లో పాలకవర్గాల నియామకాలు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. నర్సాపూర్‌లో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతుండటం పట్ల పార్టీ క్యాడర్‌లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతుంది.

సఖ్యత లేమి వల్లే జాప్యం!

నర్సాపూర్ మార్కెట్‌కమిటీతో పాటు నియోజకవర్గంలోని పలు ఆలయాల కమిటీలను కూడా నియమిస్తే పార్టీ కోసం కష్టపడ్డ వారికి తగిన ప్రతిఫలం దక్కుతుందన్న ఆశతో ఉన్నా, ఇక్కడి కీలక నాయకుల వైఖరితో కాలయాపన చేస్తుండటం పట్ల క్యాడర్ తీవ్ర నిరాశకు గురవుతుంది. ముఖ్యంగా ఇక్కడ బీఆర్ఎస్‌కు చెందిన సునీతారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నందున పలు అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ప్రకారం పాల్గొనాలంటే ఏదో ఒక పదవీ ఉండాలి అందులో మార్కెట్‌కమిటీ చైర్మన్ పదవి ఎంతో కీలకం. ఆ పదవితో పాటు ఇతర పాలకవర్గం కార్యవర్గాన్ని ప్రకటించి నియమిస్తే ఆయా అభివృద్ధి కార్యక్రమాల్లో అధికారికంగా పాల్గొనే అవకాశం కూడా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. అయితే మార్కెట్ కమిటీతో పాటు ఇతర నామినేటెడ్ పదవులు నియమించడంలో ఇక్కడి ముఖ్య నాయకుల మధ్య సఖ్యత లేమితో పాటు ఎవరికి వారు తమ అనుచర గణాన్ని నియమించుకోవాలని యత్నిస్తుండటం వల్లే నియామకాలు కావడం లేదన్న ప్రచారం జరుగుతోంది.

హామీలతోనే సరా?

ముఖ్యంగా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీ జనరల్‌కు రిజర్వు కావడంతో నర్సాపూర్, శివ్వంపేట మండల పార్టీ అధ్యక్షులతో పాటు మరికొందరు బీసీ నాయకులు ఈ పదవిపై ఆశతో ఉన్నారు. అయితే ఇక్కడి ముఖ్య నాయకులు ఎవరికి వారు తమ అనుచర నాయకుడికి హామీలు ఇస్తూ తమ వెంట తిప్పుకుంటున్నారే తప్ప స్పష్టత మాత్రం ఇవ్వడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక వైస్‌చైర్మన్‌తో పాటు 12 మంది డైరెక్టర్ల నియామకం కూడా ఎవరిని నియమించాలనే విషయంలో ముఖ్య నాయకుల మధ్య సయోధ్య కుదరకనే ఇదిగో అదిగో అంటున్నా ఖరారు కావడం లేదని నిట్టూరుస్తున్నారు.



నర్సాపూర్ మార్కెట్ యార్డు కార్యాలయం

స్థానిక ఎన్నికలపై ప్రభావం..!

పార్టీ కోసం కష్టపడ్డ వారిలో ఎవరికైనా పదవులు ఇస్తే క్యాడర్ మరింత ఉత్సాహంగా పనిచేస్తుందని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు చెబుతున్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు ఎలాంటి బాధ్యతలు అప్పజెప్పకపోవడంతో ఇంకా ఎన్నాళ్లపాటు నాయకుల వెనుక ఏ పని లేకుండా తిరగాలని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరింత జాప్యం జరిగితే వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలను ప్రభావితం చేసే అవకాశం లేకపోలేదని ఆ పార్టీ క్యాడర్ అభిప్రాయపడుతున్నారు.

తాగునీటి పైప్ లైన్ లీకేజీకి మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోహీర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తూరు (కె) గ్రామ సమీపంలో బోరు వద్ద లీకేజీతో తాగునీరు వృథాగా పోతున్న విషయమై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీరాజ్ అధికారులు స్పందించారు. ఈ మేరకు పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టి నీరు వృథాపోకుండా చేశారు. సమస్యను వెలుగులోకి తెచ్చి పరిష్కారానికి దోహదపడిన ఆంధ్రజ్యోతి దిన పత్రికను గ్రామస్థులు అభినందించారు.

ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలి



అయ్యప్ప దీక్షాదారులతో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ డీఎం

నారాయణఖేడ్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రాలకు, శుభకార్యాలకు ఆర్టీసీ బస్సుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య కోరారు. ఖేడ్ పట్టణంలోని రాంమందిర్ ఆవరణలోని అయ్యప్పస్వామి సన్నిధానంలో సోమవారం అయ్యప్ప దీక్షాదారులతో కలిసి పుణ్యక్షేత్రాలకు, శుభకార్యాల కోసం ఆర్టీసీ బస్సు సేవలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుకింగ్ చేసుకునే ఆయా బస్సులను గత ఏడాదికన్నా చార్జీలను బాగా తగ్గించినట్లు తెలిపారు. శబరిమలై వెళ్లడానికి బస్సులను బుక్ చేసుకునే విధానం, వివరాలను గురించి వివరించారు. కార్యక్రమంలో గురుస్వాములు శివానంద్, పాండు, రమేష్, సంజయ్, ప్రశాంత్, ఓంప్రకాష్, ఆర్టీసీ మార్కెటింగ్ సేల్స్ ఇన్‌చార్జి పాండు, బుకింగ్ ఇన్‌చార్జిలు రాధాక్రిష్ణ, శివశంకర్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు

సంగారెడ్డి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు సోమవారం సంగారెడ్డి జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో యువతపై సామాజిక మాధ్యమం ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వంశీకృష్ణ, సహాయ గ్రంథపాలకుడు శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగం ఆత్మగౌరవానికి ప్రతీక

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మరుగుదొడ్ల వినియోగం మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక అని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా మార్చేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని పాఠశాలు, మహిళా స్వయం సహాయక సంఘాలతో అవగాహన సదస్సులు నిర్వహించి మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. గ్రామాలు, పట్టణాల్లో పబ్లిక్ టాయిలెట్లు అవసరమైన ప్రదేశంలో నిర్మించాలని, గ్రామాలు, పట్టణాల్లోని శౌచాలయాలను సుందరీకరించిన వాటికి జిల్లా, మండల స్థాయిలో బహుమతులు అందజేస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీవో జ్యోతి, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డీపీవో సాయిబాబ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

'ప్రజావాణి'లో 42 అర్జీలు

సంగారెడ్డి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను అందజేశారు. వచ్చిన అర్జీల్లో.. సంగారెడ్డిలోని బైపాస్ రోడ్డులో గల వెంకటేశ్వరాలయం సమీపంలో నివాసముండే వసంత తమ పట్టా స్థలంలో నుంచి కొంత స్థలాన్ని ఆలయానికి వచ్చే వాహనాల పార్కింగ్ కోసం ఇవ్వాలని దౌర్జన్యం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆలయ బాధ్యులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఆమె అర్జీలో కోరింది. హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామ పంచాయతీ ఓటరు లిస్టు ఏకపక్షంగా చేశారంటూ బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బిట్ల మహేష్ ఫిర్యాదు చేశారు. కంది మండలం ఎర్దనూర్ గ్రామ రైతులకు న్యాయం చేయాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు చేశారు. వీటితో పాటు ఇతర సమస్యలపై మొత్తం 42 మంది అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో పద్మజారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

రైతులకు అందుబాటులో ఉంటాం



కౌల్దారం: సంగాయిపేటలో రైతులతో మాట్లాడుతున్న మెదక్ జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి హరిక్రిష్ణ

కౌల్దారం/మనోహరాబాద్/నర్సాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అందుబాటులో ఉంటామని మెదక్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి హరికృష్ణ తెలిపారు. సోమవారం కౌల్దారం మండల పరిధిలోని చిన్న ఘనపూర్, సంగాయిపేట, కోనాపూర్, ఎనగండ్ల గ్రామాల కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు. సంగాయపేటలో రైతులతో మాట్లాడిన వెంటనే జిల్లా శాఖ అధికారి ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే చేగుంటలో ఉన్న ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్‌ను తీసుకురావాలని సూచించారు. మనోహరాబాద్ మండలం పోతారం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. సోమవారం నుంచి మండలంలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో సన్నధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. అదేవిధంగా నర్సాపూర్‌లోని పలు రైసుమిల్లులతో పాటు కొనుగోలు కేంద్రాలను తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి సోమవారం సందర్శించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విధానంతో పాటు మిల్లుల వద్ద ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారనే విషయమై ఆరా తీశారు. మండలంలోని తుల్జారాంపేట గ్రామంలో కొనుగోలు కేంద్రంతో పాటు నర్సాపూర్‌లోని శివసాయి బాయిల్డు మిల్లును డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐ జాన్‌రెడ్డితో కలిసి సందర్శించారు.

తండాల అభివృద్ధి కోసం కృషి చేయండి



రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిని కలిసిన ఖేడ్ నాయకులు

నారాయణఖేడ్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమం, తండాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ జిల్లా మాజీ సభ్యుడు రవీందర్ నాయక్, ఖేడ్ జడ్పీటీసీ లక్ష్మీబాయి కోరారు. హైదరాబాద్‌లో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి డాక్టర్ శరత్‌ను సోమవారం కలిసి పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని చాలా తండాల్లో రోడ్లు చెడి పోయాయని, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులు, రోడ్లు లేని తండాలకు రోడ్లను నిర్మించాలని కోరారు. గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి, తండాల్లో విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

బంజారా నాయకుల ముందస్తు అరెస్టు

పాపన్నపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనకు సంబంధించి వికారాబాద్ తరలివెళ్లకుండా మండల బంజారా నాయకులను పోలీసులు సోమవారం ముందస్తు అరెస్టు చేసి పాపన్నపేట ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా... బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూల్‌సింగ్ నాయక్ మాట్లాడుతూ..ఫార్మా కంపెనీ కోసం భూముల విషయంలో బంజారాలను ఇబ్బందులు పెట్టొదన్నారు. అమాయకులపై నమోదు చేసిన కేసులు తక్షణం ఎత్తివేయాలన్నారు. అరెస్టయినవారిలో నాయకులు విఠల్, అమ్ము, పీర్యా, రాజు, తుకారాం, తదితరులున్నారు.

తెగుళ్లను తట్టుకునే పంటలను వేయాలి



రైతులకు శనగవిత్తనాలను అందజేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

జహీరాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులు తెగుళ్లను తట్టుకునే లక్షణాలున్న పంటలను వేయాలని సంగుపేట శాస్త్రవేత్తలు రాహుల్ విశ్వకర్మ, సరిత పేర్కొన్నారు. సోమవారం మొగుడంపల్లి మండలంలోని ధనసిరి, జహీరాబాద్ మండలంలోని రంజోల్ గ్రామంలో రైతులకు శనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రైతులు పొలాల్లో విత్తనాలను వేసేముందు మేలురకం వంగడాలను ఎంచుకోవాలన్నారు. తాము అందజేస్తున్న శనగ విత్తనాలతో దిగుబడులు అధికంగా వస్తాయన్నారు. అనంతరం రంజోల్ గ్రామంలో పలువురు రైతులు సాగుచేస్తున్న ఆయిల్‌పామ్ పంటలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో ప్రదీప్‌కుమార్, ఏరువాక కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సంగారెడ్డి అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఫీడర్ మెయింటనెన్స్‌లో భాగంగా ఈ నెల 19న సంగారెడ్డిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-1 ఏఈ సంతోష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత బస్టాండ్ సమీపంలోని కొత్త పోస్టాఫీస్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సినిమారోడ్, శివాజీనగర్, జలాల్‌బాగ్, అంబేడ్కర్ సర్కిల్, స్టేడియం గ్రౌండ్స్, సాయికృపానగర్, నేతాజీ నగర్, బాబానగర్, భగత్‌సింగ్‌నగర్, నారాయణరెడ్డిచౌక్, ఉప్పర్‌బజార్, శివంగుల ఏరియాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

- జిన్నారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల కోసం ఈ నెల 19న సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. సబ్‌స్టేషన్ మూడు పరిధిలోని నివాస ప్రాంతాలు, పారిశ్రామిక వాడలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

లోకమంతన్ పోస్టర్ ఆవిష్కరణ

చేగుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో సోమవారం తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, ఉపాధ్యాయులు లోకమంతన్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 24 వరకు హైదరాబాద్‌లోని శిల్పారామంలో భారతదేశం సంప్రదాయాలు, సంస్కృతీ పద్ధతులు నాగరికత వారసత్వ పునరుజ్జీవనం వంటి కార్యక్రమాలను ప్రతీ ఒక్కరు తిలకించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో తపస్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, దేవానంద్, తపస్ స్పోర్ట్స్ కమిటీ కన్వీనర్ వినోద్, తపస్ మండల అధ్యక్షుడు వెంకటేష్, సభ్యులు శారద, మంజులత, శంకర్, లతీఫా, రమేష్, అరుణ, పాల్గొన్నారు.

హరీశ్‌ను కలిసిన నాయకులు

మునిపల్లి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీమంత్రిని కలిసిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్, తాటిపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ అంజన్న, నాయకులు బక్కారెడ్డి, మల్లేశం, నర్సింహారెడ్డి, చిన్న కృష్ణ, పెద్దనర్సింహారెడ్డి, పెద్ద కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, సికిందర్‌రెడ్డి, మోహన్ రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.



మాజీ మంత్రి హరీశ్‌రావుతో బీఆర్ఎస్ నాయకులు

'ఆశా'లకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలి



ఎమ్మెల్యే సునీతారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

నర్సాపూర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్లకు కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి తమ చిత్తశుద్ధి చాటుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం నర్సాపూర్‌లోని తన స్వగృహంలో ఎమ్మెల్యేను స్థానిక ఆశ వర్కర్లు కలిసి ప్రభుత్వం తమకు ఇచ్చిన హామి నెరవేర్చేలా చూడాలని వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఆశ వర్కర్లకు నెలకు రూ.18వేల వేతనంతో పాటు ఉద్యోగభద్రత, ఇతర హామీలను ఇచ్చిందే తప్ప నేటికీ అమలు కావడం లేదని విమర్శించారు. ప్రభుత్వం వారి సమస్యలు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఈ విషయాన్ని ప్రస్తావించి ఆశ వర్కర్ల సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్ వరం

పేదల వైద్య ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ నిధులు ఎంతో దోహదపడుతాయని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో హత్నూర మండలంలోని వివిధ గ్రామాలకు చెందినవారికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీం, సీనియర్ నాయకులు సత్యంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పడిగిపల్లిలో పత్తికొనుగోలు కేంద్రం ప్రారంభం



పగిడిపల్లి సమీపంలో జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించిన పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి కోరారు. సోమవారం మండలపరిధిలోని పడిగిపల్లి సమీపంలోని లక్ష్మీజిన్నింగ్ మిల్లులో ఆయన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు గుండేరావుమాజీ సర్పంచు లక్ష్మి, రాజుపటేల్, మిల్లు సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి



ఫైజాబాద్ చెరువులో చేపపిల్లలను వదులుతున్న సహకార సంఘం సభ్యులు

చిలప్‌చెడ్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని మత్స్యకారులంతా ఆర్థికంగా ఎదగాలని ఫీల్డ్ ఆఫీసర్ భరత్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఫైజాబాద్ గ్రామంలో గల పెద్ద చెరువులో మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో 42వేల చేపపిల్లలను ఇతర కుంటల్లో 34,500 చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మేకల జనార్దన్, మత్స్య సహకార సంఘం గ్రామాధ్యక్షుడు పుట్టి కిష్టయ్య, సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిలో క్యాపింగ్ సెర్మని

మెదక్ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసుపత్రిలో సోమవారం నర్సింగ్ ఆఫీసర్ నుంచి సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందిన రజని, వినయ కుమారి, కృపవరం, మాదవి తదితరులకు క్యాపింగ్ సెర్మని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త శివదయాల్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ చేతులమీదుగా వారికి క్యాపింగ్ సెర్మని నిర్వహించారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు చంద్రశేఖర్, యాదగిరి, ఫార్మాసిస్ట్ బాలప్రసాద్, బుచ్చి రాములు, వీసీటీసీ కౌన్సిలర్ రాజేష్, ఆసుపత్రి వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పదోన్నతి పొందినవారికి క్యాపింగ్ సెర్మని నిర్వహిస్తున్న దృశ్యం

కొనుగోలు కేంద్రాలు తెరిచారు సరే.. తూకం వేసేదెప్పుడు?

(3వ పేజీ తరువాయి)

ఇంకా ప్రారంభం కాలేదని ఆరోపించారు. దీంతో, ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. నిల్వలు భారీగా ఉండడంతో తూకం ప్రారంభించినా లారీల కొరత తలెత్తే అవకాశం ఉన్నదని వాపోయారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి ధాన్యం తూకం వేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే ఆలస్యం

-బాదిన లక్ష్మణ్, సీతానగర్

ధాన్యం కొనుగోలులో అధికారుల నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులకు గురికావలసి వస్తున్నది. నిన్న, మొన్నటి వరకు హమాలీలు అందుబాటులో ఉండగా గోనె సంచులు లేవని తూకం వేయలేదు. ఇప్పుడు సంచులు అందుబాటులో ఉన్నా హమాలీలు లేరని చెప్తున్నారు. అధికారులు సకాలంలో స్పందించకపోవడంతోనే కొనుగోళ్ల ప్రారంభం కాలేదు.

15 రోజులుగా ఎదురుచూస్తున్నాం

-బాదిన కిష్టయ్య. రైతు, సీతానగర్

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచిస్తున్న అధికారులు తూకం వేసే సమయంలో ముఖం చాటేస్తున్నారు. రైతుల గోసను పట్టించుకోవడం లేదు. కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకువచ్చి 15 రోజులవుతున్నా తూకం వేయడం లేదు. దీంతో రేయిబవళ్లు కొనుగోలు కేంద్రాల వద్దనే పడిగాపులు కాయాల్సి వస్తున్నది.

వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

చిలప్‌చెడ్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో విఠల్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలం పరిధిలోని చిట్కుల్ గ్రామంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభా పాఠవాలను పరీక్షించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. డిసెంబరులో నిర్వహించబోయే న్యాస్ పరీక్షలో విద్యార్థులు రాణించేలా సంసిద్ధం చేయాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకోవాలని సూచించారు.

సర్వే పత్రాల్లో తప్పులు లేకుండా చూడండి

మునిపల్లి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): సమగ్రకుటుంబ సర్వేలో ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తు పత్రాల్లో తప్పులు లేకుండా చూసే బాధ్యత సూపర్‌వైజర్లదేనని ఎంపీడీవో డాక్టర్ హరినందన్‌రావు ఆదేశించారు. సర్వేలో భాగంగా వివరాలను ఆన్‌లైన్ నమోదు చేయడంపై సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సూపర్‌వైజర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

'లింగాయత్' ప్రమాణస్వీకారోత్సవానికి మంత్రికి ఆహ్వానం



మంత్రి దామోదర్‌కు ఆహ్వానిస్తున్న వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 24 వ తేదీన వీరశైవ లింగాయత్ సమాజం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సమాజ్ జిల్లా అధ్యక్షుడు ఇప్పపల్లి నర్సింలు ఆధ్వర్యంలోమంత్రి దామోదర రాజనర్సింహను ఆహ్వానించారు. ప్రమాణ స్వీకారంతో పాటు వనభోజనాలకు రావాలని మంత్రిని కోరారు. మంత్రిని ఆహ్వానించినవారిలో సమాజ్ సభ్యులు బస్వరాజ్, శివచంద్రపాటిల్, నాయికోటిరామప్ప, సిద్దేశ్వర్, చంద్రశేఖర్, రాజేశ్వర్, శివప్రసాద్, సంతోష్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

24న కార్తీక వన భోజన కార్యక్రమం

సంగారెడ్డి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వీరశైవ లింగాయత్, లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న కార్తీక వన భోజనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ధనంజయ, అధ్యక్షుడు పృథ్విరాజ్, ప్రధానకార్యదర్శి మల్లికార్జున్ పాటిల్ తెలిపారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని దుర్గాభవానీమాత ఆలయం వద్ద సోమవారం వనభోజన ఆహ్వానపత్రికను ఆవిష్కంచారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.